# జీవో-29ను రద్దు చేయాలి

- నిరుద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం శాపంగా మారింది
- నిర్బంధాలతో ఉద్యమాలను అణిచి వేయలేరు
- గ్రూప్-1 అభ్యర్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి
- విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

బడంగ్‌పేట, అక్టోబర్ 19: గ్రూప్-1 అభ్యర్థుల సమస్యను పరిష్కరించకుండా ప్రభుత్వం ద్వంద నీతి ప్రదర్శిస్తుందని బీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ ధ్వజమెత్తారు. శనివారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆయన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గ్రూప్-1 అభ్యర్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్న వారిపై లాఠీలు ఝుళిపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిరుద్యోగులకు ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. జీవో నంబర్.29ని రద్దు చేయాలని.. ప్రభుత్వం కుట్రలు చేస్తూ అణగారిన వర్గాల విద్యార్థులకు ఈ జీవోతో నష్టం జరుగుతుందన్నారు. ప్రాథమిక హక్కుల సూత్రాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం పనిచేస్తుందని.. అణగారిన వర్గాల హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. గతంలో ఉన్న జీవోను అమలు చేయాలని.. ఎస్టీ, ఎస్సీ, బీసీలకు ముందు భర్తీ చేసిన తర్వాత జనరల్ పోస్టులు భర్తీ చేసేవారని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల విద్యార్థులను విద్యకు, ఉద్యోగాలకు దూరం చేయడానికి పెద్ద కుట్ర చేస్తుందన్నారు. నిరసన తెలిపే హక్కును కాలరాస్తున్నారని.. రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తోందని పేర్కొన్నారు.

## వైద్య శిబిరానికి స్పందన



కందుకూరు, అక్టోబర్ 19: కొత్తగూడ గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన శిబిరంలో గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి.. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య సిబ్బందితో పాటు మాజీ వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



అధ్వానంగా మారిన పులిమామిడి-కొళ్లపడకల్ రోడ్డు

# అధ్వానం.. అవస్థలు

కందుకూరు, అక్టోబర్ 19: పులిమామిడి-కొళ్లపడకల్ మధ్య ఇప్పటికే ఉన్న రోడ్డు కాస్త అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో ఆ రోడ్డు గుండా వెళ్లాలంటేనే ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా ఈ రోడ్డు గుండా ప్రయాణించేందుకు అనుమతి లేదంటూ అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్, కొత్తూరు, కొడిచర్ల, జహంగీర్‌పీర్ దర్గా గ్రామాలకు కందుకూరు మండల పరిధిలోని కొత్తగూడ, జైత్వారం, పులిమామిడి గ్రామాల మీదుగా వెళితే సుమారు 10 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. అయితే చిప్పలిపల్లి మీదుగా వెళ్లాలంటే మాత్రం 15కిలోమీటర్ల దూరం అవుతుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇంతేకాకుండా అటవీశాఖ అధికారులు అడవిలో రోడ్డుకు అడ్డంగా కందకాలు సైతం తీశారు. దీంతో దూరభారం తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు అటవీశాఖ అధికారులతో చర్చించి మునుపటి రోడ్డు గుండానే రాకపోకలు సాగించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీంతోపాటు అనుమతులు రాగానే వెంటనే రోడ్డును మరమ్మతు చేసి అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### పట్టించుకోవడం లేదు..



పులిమామిడి నుంచి కొళ్ల పడకల్ రోడ్డు విషయంలో ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. పులిమామిడి మీదుగా షాద్‌నగర్ వెళ్లాలంటే 10కిలో మీటర్ల దూరం తగ్గుతుంది. ఈ మధ్యలో ఫారెస్టు ఉండటంతో ఫారెస్టు అధికారులు అడ్డు చెబుతున్నారు. రోడ్డుకు అడ్డంగా కందకాలు తీశారు. రోడ్డు వసతి ఉంటే ప్రజలకు ఎంతో ఉపయోగం పడుతుంది. అధికారులు చొరువ తీసుకొని పులిమామిడి, కొళ్లపడకల్ రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

*- ఆనేగౌని సంధ్య, మాజీ వైస్ ఎంపీపీ*

### రోడ్డు వసతి కల్పించాలి..



పులిమామిడి నుంచి కొళ్లపడకల్ వెళ్లడానికి వేసిన రోడ్డు పూర్తిగా అస్తవ్యస్తంగా తయారైంది. రోడ్డును మరమ్మతులు చేయిండానికి నిధులు మంజూరు చేయాలని అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదు. రోడ్డు మధ్యలో ఫారెస్టు ఉండటంతో ఫారెస్టు అధికారులు రోడ్డు మరమ్మతులు చేయించడానికి అడ్డగిస్తున్నారు. ఎన్నిసార్లు ప్రయత్నించిన ఫారెస్టు అధికారులు అడ్డు చెబుతున్నారు.

*- వత్తుల అనిత, మాజీ సర్పంచ్ పులిమామిడి*



అనన్య ఏకో పార్కులో మాట్లాడుతున్న పద్మశాలీ సంఘం ఎల్బీనగర్ సర్కిల్ అధ్యక్షుడు పున్న గణేశ్‌నేత

## నేడు ఆటోనగర్‌లోని అనన్య ఏకో పార్కులో పద్మశాలీ దసరా మేళా

మన్సూరాబాద్, అక్టోబర్ 19: పద్మశాలీ సంఘం ఎల్బీనగర్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న 22వ పద్మశాలీ దసరా మేళాకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధ్యక్షుడు పున్న గణేశ్‌నేత తెలిపారు. ఆటోనగర్‌లోని అనన్య ఏకో పార్కులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అనన్య ఏకో పార్కులో ఆదివారం ఉదయం 10:30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు దసరా మేళా కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలోని పద్మశాలీ ప్రముఖులు, కులబాంధవులు సకుటుంబ సమేతంగా హాజరై దసరా మేళాను విజయవంతం చేయాలని కోరారు. దసరా మేళాకు మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, బీసీ కమీషన్ సభ్యుడు రాపోలు జయ ప్రకాశ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో దసరా మేళా కమిటీ చైర్మన్ కొకుంట్ల రవి తేజ, ప్రధాన కార్యదర్శి గడ్డం లక్ష్మీనారాయణ, ప్రతినిధులు సీత ఆంజనేయులు, వేముల రాము, రాపోలు సుధాకర్, బురుగు తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

## పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి: ఎమ్మెల్యే బండారి

మన్సూరాబాద్, అక్టోబర్ 19: విద్యార్థులను సన్మార్గంలో నడిపించడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. నాగోల్ డివిజన్ పరిధిలోని శుభం కన్వెన్షన్ హాల్లో శనివారం ఉప్పల్ మండల స్థాయి సీనియర్ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ మండల పరిధిలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలను గుర్తించి సదరు పోస్టులను భర్తీ చేయిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రామారావు, నాగోల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మిదేవి, కొత్తపేట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.విజయేందర్‌రెడ్డి, ఈ.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, అక్టోబర్ 19: నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్‌లోని విజయపురి కాలనీ ఫేజ్-1లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులు, బీఎన్‌రెడ్డినగర్‌లో జరుగుతున్న ఓపెన్ జిమ్ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. రహదారులు ఎక్కువ కాలం ఉండేలా ప్రమాణాలు పాటించాలన్నారు. బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్-1లో నిర్మిస్తున్న ఓపెన్ జిమ్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

## సహకారం సంఘం అభివృద్ధికి సహకరించాలి




డీసీసీబీ చైర్మన్ సత్తయ్యకు వినతిపత్రం అందజేస్తున్న చంద్రశేఖర్, ఆనంద్

కందుకూరు, అక్టోబర్ 19: సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలని పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్ కోరారు. డైరెక్టర్ పొట్టి ఆనంద్‌తో కలిసి డీసీబీ (జిల్లా సహకార) చైర్మన్ పెద్దకుర్మ సత్తయ్యను కలిసి వినతిపత్రం అందజేసిన అనంతరం మాట్లాడుతూ.. సహకార సంఘం అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. రైతులకు సకాలంలో రుణాలను అందజేపి ఆదుకోవాలని కోరారు. స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను అందజేసి అన్ని విధాలుగా ఆదుకోవడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. పంట రణాలకు రెండు కోట్లు, ఎల్‌టీ రుణాలకు రూ.3కోట్లను మంజూరు చేయాలని కోరారు. రుణాల కోసం రైతులు తిరుగుతున్నారని, అందుకోసం తక్షణమే నిధులను మంజూరు చేయాలని కోరారు. డీసీసీబీ చైర్మన్ నిధులు ఇవ్వడానికి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## పోచమ్మ ఆలయంలో చోరీకి యత్నం.. అరెస్ట్

బడంగ్‌పేట, అక్టోబర్ 19: బడంగ్‌పేటలోని పోచమ్మ దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తి హుండీ దొంగతనం చేయడానికి ప్రయత్నం చేసిన విషయంపై బడంగ్‌పేటకు చెందిన సామ సంజీవ రెడ్డి మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరిగిందని మీర్‌పేట సీఐ నాగరాజు తెలిపారు. శనివారం మధ్యాహ్నం సమయంలో లెనిన్ నగర్ బ్లాక్ నంబర్ ఏలో నివాసం ఉంటున్న ఆంగోత్ కుమార్ (26)హుండీ దొంగతనానికి పాల్పడినట్లు ఆధారాలు లభించడంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన్నట్లు సీఐ తెలిపారు. ఇదివరకే అతడిపై మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో పాత కేసులు ఉన్నట్లు తెలిపారు.

## వాకింగ్‌కు వెళ్లిన మహిళ అదృశ్యం



పర్వీన్ ఖాతూన్(ఫైల్)

మలక్‌పేట, అక్టోబర్ 19: వాకింగ్‌కు వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సలీంనగర్‌కు చెందిన మన్సూర్ అలీఖాన్‌కు పర్వీన్ ఖాతూన్(31)తో 2008లో జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. కాగా ఈనెల 10న సాయంత్రం 6.15 గంటలకు వాకింగ్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన పర్వీన్ తిరిగి రాలేదు. దాంతో ఆందోళనకు గురైన మన్సూర్ పది రోజులుగా అన్నిచోట్లా వెతికినా.. ఆచూకీ లభించకపోవటంతో శనివారం మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ సీహెచ్.సురేశ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



బహుజన సమాజ్ పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం అధ్యక్షుడిగా నియమితుడైన వేముగంటి సంపత్ నియామక పత్రాన్ని అందుకుంటున్న దృశ్యం

## నూతన నియామకం

మన్సూరాబాద్, అక్టోబర్ 19: బహుజన సమాజ్ పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం అధ్యక్షుడిగా వేముగంటి సంపత్ నియమితుడయ్యాడు. ఎల్బీనగర్‌లోని బీఎస్పీ కార్యాలయంలో శనివారం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కాటపాక రమేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుండెల ధర్మేందర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పల్నాటి రాములు చేతులమీదుగా వేముగంటి సంపత్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ.. ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఎస్పీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన బీఎస్పీ రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బండారి రవికుమార్, జిల్లపల్లి శశిధర్, మంత్రి జగన్, గువ్వల సాయి, రామకృష్ణ, మేకల లక్ష్మణ్, జక్క యాదగిరి, దాసరి వినయ్, కొమ్ము పవన్, నల్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

*మహేశ్వరం, అక్టోబర్ 19: మహేశ్వరం మండల పరిధిలోని దుబ్బచర్ల గ్రామంలో నాబార్డు సంస్థ సహకారంతో సొసైటీ ఫర్ ఎకనామికల్ డెవలప్ మెంట్ వారి ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు కంప్యూటర్, ఎంబ్రాయిడింగ్‌లో ఉచిత శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్లేస్ మెంట్ అధికారి శరత్ చంద్ర, క్రాంతి శనివారం శిబిరాన్ని సందర్శించారు. స్వయం సహాయక సంఘాల మహిళల(డ్వాక్రా) కోసం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరం 20 రోజుల పాటు ఉంటుందని.. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నెల 19 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోశాధికారి రమేశ్, రంగారెడ్డి జిల్లా కో-ఆర్డినేటర్ షేక్ హాజీ బాబా, ట్రైనింగ్ మాస్టర్ ప్రేమలత, దుబ్బచర్ల గ్రామ సంఘం అధ్యక్షురాలు రమాదేవి, ఖుషి, తదితరులు పాల్గొన్నారు.*



స్వయం సహాయక సంఘాల మహిళల కోసం ఉచిత కంప్యూటర్, ఎంబ్రాయిడింగ్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన శరత్ చంద్ర, కాంత్రి



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాగోల్‌లో నిర్మించిన ఎస్‌టీపీ ప్లాంట్‌ను సందర్శించేందుకు వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ పాలకమండలి మాజీ ధర్మకర్తలు బీసుకుంట్ల సతీశ్‌గౌడ్, మధుసాగర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు. - చంపాపేట, అక్టోబర్ 19



వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్‌గా నియమితులైన ఎం.కోదండ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాకప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సీహెచ్ బాలరాజు, కార్యదర్శి కోట్ల శ్రీనివాస్, మామిడి కృష్ణకుమార్, బీసీ సెల్ స్టేట్ కన్వీనర్ పృథ్వీరాజ్, బాల పోచయ్య, శ్రీనివాస్ తదితరులు. - సైదాబాద్, అక్టోబర్ 19



ఎమ్మెల్సీ బల్మూర్ వెంటన్‌ను కలిసి సత్యసాగర్‌నగర్ కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎన్ఎస్‌యూఐ నాయకులు వినయ్ పటేల్, కాలనీ అధ్యక్షులు ఓవీఆర్ కుమార్, ఉదయకృష్ణ, శశిధర్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



బడంగ్‌పేట, అక్టోబర్ 19: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్‌లోని సీతా ఎవెన్యూ కాలనీ, పద్మావతి కాలనీల్లో సీసీ రోడ్డు పనులకు మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ సంయుక్త ఆధ్వర్యంలో శంకుస్థాపనలు చేశారు. శంకుస్థాపన చేసిన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతాప్రమాణాలను పాటిస్తూ పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బండారు మనోహర్, వంగేటి ప్రభాకర్ రెడ్డి, ఎర్ర మహేశ్వరి జైయింద్ తదితరులు ఉన్నారు.

## సకాలంగా పనులు పూర్తి చేయాలి



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత తదితరులు

సైదాబాద్, అక్టోబర్ 19: ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని లక్ష్మినగర్ కాలనీ బస్తీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతాప్రమాణాలను పాటించి.. సకాలంగా పనులు పూర్తి చేయాలని తెలిపారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో కొత్త రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాగానే పనులను ప్రారంభిస్తామన్నారు. స్థానికులు సుబ్రహ్మణ్యం, గోపి, మొగిలి, శ్రీను, శంకర్, వెంకటయ్య, దుర్గా కిషన్, మోహన్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి



లాడ్జి, హోటళ్ల నిర్వాహకులను ఉద్దేశించి మాట్లాడుతున్న సౌత్ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ తదితరులు

సైదాబాద్, అక్టోబర్ 19: ప్రభుత్వ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని సౌత్ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ తెలిపారు. శనివారం సైదాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో జరిగిన సౌత్ఈస్ట్ జోన్ పరిధిలోని లాడ్జి, హోటళ్ల యజమానులు, నిర్వాహకులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగిచారు. లాడ్జీలు, హోటళ్ల నిర్వాహకులు తెలంగాణ రాష్ట్ర ప్రజా భద్రతా చట్టం, ట్రేడ్ లైసెన్స్ నిబంధనలు, బీఎన్ఎస్ఎస్ సహా చట్టం పరిధిలో పనిచేయాలని సూచించారు. వ్యాపార కార్యకలాపాలను నిర్వహించే వారందరూ ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అన్నారు. లాడ్జికి వచ్చే వ్యక్తుల పూర్తి వివరాలను సేకరించి, వ్యక్తిగత గుర్తింపు కార్డులను తీసుకోవాలన్నారు. వాణిజ్య, వ్యాపారస్తులందరూ తమ ప్రాంగణంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, గేమింగ్, డ్రగ్స్, వ్యభిచారం వంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరిగినట్లుగా గుర్తిస్తే, పోలీసులకు తెలియజేయటం బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ టి.స్వామి, జోన్ పరిధిలోని ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, లాడ్జి, హోటళ్ల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.